

పులకించిన భద్రగిరి 8లో..
8లో.. భూములు కోల్పోతున్నవారికి అండగా ఉంటాం

శ్రీకరం.. మనోహరం

- కన్నుల పండువగా సీతారాముల కల్యాణం
- భక్తులతో పోటెత్తిన ఆలయాలు
- పట్టువస్త్రాలు సమర్పించిన మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్ దంపతులు
- పూజలు నిర్వహించిన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే



జగిల్యాలలో కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 17: సీతారాముల కల్యాణం జగిత్యాల జిల్లా వ్యాప్తంగా బుధవారం కన్నుల పండువగా జరిగింది. జిల్లాలోని వివిధ దేవాలయాల్లో సీతారాముల కల్యాణ మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు ఆలయాలను సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకావడంతో ఆలయాలు జనంతో పోటెత్తాయి. ఆలయాల్లో భక్తులకు అభివృద్ధి కమిటీల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంప్‌లోని కోదండ రామచంద్రస్వామి ఆలయంలో 45వ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై సీతారాముల విగ్రహాలను ఉంచి వేద పండితులు చంద్రశేఖర్ శర్మ ఆధ్వర్యంలో వైభవంగా వివాహ వేడుకలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి మున్సిపల్ కమిషనర్ అనీల్ బాబు దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఉత్సవమూర్తులైన స్వామివారలను వేదిక వద్దకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. వేద బ్రాహ్మణుల ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. 45వ బ్రహ్మోత్సవాన్ని పురస్కరించుకుని వీహెచ్‌పీ ఆధ్వర్యంలో 45 కిలోల లడ్డూను స్వామి వారలకు బహూకరించారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్ కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి హాజరై పూజలు నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. స్వామి వారి పల్లకి సేవలో మహిళలు పాల్గొని కోలాటాలు వేస్తూ సందడి చేశారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీతారామాంజనేయ స్వామి ఆలయంలో..

జగిత్యాలలోని విద్యానగర్ సీతారామాంజనేయ స్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్థానిక సత్యనారాయణ స్వామి ఆలయం నుంచి సీతారామ చంద్రుల విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువచ్చారు. మహిళలు కోలాటాలతో, డప్పు చప్పుళ్లతో భారీ ఊరేగింపు నిర్వహించారు. అర్చకుడు సింహాచలం శ్రీనివాసాచార్య, రంజిత్‌కుమారాచార్యల పర్యవేక్షణలో కిరణ్, భాను ఆచార్యులు కల్యాణ మహోత్సవం జరిపించారు. అనంతరం సీతాదేవికి ఒడి బియ్యం పోసి మహిళలు సాంప్రదాయం చాటుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మున్సిపల్ ఆధ్వర్యంలో పట్టువస్త్రాలు సమర్పించారు. చిన్నారులు వివిధ వేశాదారణలతో భక్తులను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల కోర్టు న్యాయమూర్తులతో పాటు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



మార్కండేయ ఆలయంలో...

జిల్లా కేంద్రంలోని భక్త మార్కండేయ ఆలయంలో సీతారాముల కల్యాణం ఘనంగా జరిగింది. మేళతాళాల మధ్య ఆలయ కమిటీ సభ్యులు ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదిక వద్దకు తీసుకువచ్చారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ దంపతులతో పాటు పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడు ఆకుబత్తిని శ్రీనివాస్ ఆలయ కమిటీ సభ్యులు పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. అనంతరం వేదపండితులు విష్ణు శర్మ, మేడిపల్లి శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పద్మశాలి సేవా సంఘం సభ్యులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

బంజరుదొడ్డి ఆంజనేయస్వామి ఆలయంలో...

పట్టణంలోని నిజామాబాద్ రోడ్డులో ఉన్న బంజరుదొడ్డి ఆంజనేయ స్వామి ఆలయంలో పెరంబుదూరు కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రత్యేక వేదికపై సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. మహిళలు సీతా దేవికి ఒడి బియ్యం సమర్పించారు. ఆంజనేయ మాలధారణ భక్తులు స్వామివారి ఊరేగింపు నిర్వహించగా, మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే జిల్లా కేంద్రంలోని అష్టలక్ష్మి దేవాలయంలో శ్రీరామనవమి వేడుకలు నిర్వహించారు. బ్రహ్మణవాడలోని శ్రీరామమందిరం, హరిహర ఆలయం, అరవింద్‌నగర్‌లోని అభయాంజనేయస్వామి ఆలయం, పోచమ్మవాడలోని ఆంజనేయ స్వామి ఆలయం, గోవిందుపల్లి, టవర్‌సర్కిల్‌లో ఉన్న శివాలయం, హరిహరాలయాలతో పాటు అన్నివార్డుల్లో దేవాలయాల్లో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం, మినరల్ వాటర్, మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు.

కొండగట్టులో వైభవంగా సీతారాముల కల్యాణం

మల్యాల: కొండగట్టు శ్రీఆంజనేయ స్వామి సన్నిధిలో శ్రీరామ నవమి పురస్కరించుకోని బుధవారం శ్రీ సీతారాముల కళ్యాణం వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక వేదికపై ఉత్సవమూర్తులకు ఆలయ అర్చ కులు, వేదపండితులు కల్యాణంను ఘనంగా జరిపారు. ఉత్సవ మూర్తులకు అభిషేకాలు, పట్టువస్త్రాలంకరణ చేసి కళ్యాణంను నిర్వహించి హోమం చేశారు. ప్రత్యేక పూజలు జరిపారు. కార్య క్రమంలో ఏఈవో వైరాగ్యం అంజయ్య, స్థానాచార్యులు కపీందర్, ప్రధానర్చకులు రామకృష్ణ, జితేంద్రప్రసాద్, రఘు, ఆలయ అధికారు లు చంద్రశేఖర్, సునీల్, ఉమామహేశ్వర్‌రావు, సంపత్, దర్మేంధర్, రాజేందర్‌రెడ్డి, భక్తులు కల్యాణంను తిలకించారు.



కొండగట్టులో స్వామివారి కల్యాణం



పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ దంపతులు




కొండగట్టులో కల్యాణానికి హాజరైన భక్తులు



జగిత్యాలలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే సంజయ్



నేటి నుంచి నామినేషన్లు షురూ

- నోటిఫికేషన్ విడుదల చేయనున్న ఎన్నికల కమిషన్
- నామినేషన్ సమర్పణలకు ఈనెల 25వ తేదీ వరకు గడువు
- 26వ తేదీన పరిశీలన
- ఉపసంహారణకు 29 వరకు గడువు

జగిత్యాల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ గురువారం విడుదల కానుంది. అదే రోజు నుంచి నామినేషన్లను స్వీకరించేందుకు ఎన్నికల కమిషన్ ఏర్పాట్లు పూర్తి చేసింది. ప్రతీరోజు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు. నోటిఫికేషన్ విడుదల, నామినేషన్ల పర్వం ప్రారంభమవుతుండడంతో అధికార యంత్రాంగం అన్ని రకాల ఏర్పాట్లు చేసింది. నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఉన్న జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల అసెంబ్లీ నియోజకవర్గాల్లో, పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో గల జిల్లాలోని ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గంలో, కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో గల జిల్లాలోని చొప్పదండి అసెంబ్లీ నియోజకవర్గం కొడిమ్యాల, మల్యాల మండలాల్లో, వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గం కథలాపూర్, మేడిపల్లి, బీమారం మండలాల్లో లోక్‌సభ ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లు అధికారులు పూర్తి చేశారు. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను సైతం నియామకం చేశారు. నిజామాబాద్, పెద్దపల్లి, కరీంనగర్ కేంద్రాల్లో నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

● రాష్ట్రంలో నాలుగో విడతలో..

దేశవ్యాప్తంగా ఏడు విడతల్లో ఎన్నికలు నిర్వహించనుండగా తెలంగాణలో నాలుగో విడతలో భాగంగా మే 13వ తేదీన పోలింగ్‌ను కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తుంది. ఏప్రిల్ 18వ తేదీన ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయనుండగా ఏప్రిల్ 25వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణకు చివరి తేదీగా ప్రకటించింది. ఏప్రిల్ 26వ తేదీన నామినేషన్ల పరిశీలన, ఏప్రిల్ 29వ తేదీ వరకు నామినేషన్ల ఉప సంహరణకు ఆఖరు తేదీగా ప్రకటించింది. మే 13వ తేదీన పోలింగ్ నిర్వహించి జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి చేయనున్నట్లు ఈసీ ప్రకటించింది. ఈమేరకు జగిత్యాల జిల్లాలోని నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్నికలను నిర్వహించడానికి అధికారులు సిద్ధంగా ఉన్నారు.

● పెరగనున్న ఓటర్లు...

జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గాల్లో 7,09,311 ఓటర్లున్నారు. ఇందులో పురుషులు 3,40,627 మంది, స్త్రీలు 3,68,650 మంది, ఇతరులు 34 మంది ఉన్నట్లు ప్రకటించారు. జిల్లా వ్యాప్తంగా 18, 19 సంవత్సరాలు వయస్సు గల ఓటర్లు 20,796 ఉండగా పురుషులు 11,282, మహిళలకు 9,512, ఇతరులు ఇద్దరు ఉన్నారు. అదేవిధంగా 20 నుంచి 29లోపు వయస్సు గల ఓటర్లు 1,50,551 మంది ఉండగా పురుషులు 75,299 మంది, స్త్రీలు 75,233 మంది, ఇతరులు 19 మంది ఉన్నారు. జిల్లాలో 31,954 మంది దివ్యాంగ ఓటర్లుండగా పురుషులు 15,374, స్త్రీలు 16,578, ఇతరులు ఇద్దరు ఉన్నారు. ఎన్నికల సంఘం ఇచ్చిన అవకాశం మేరకు ఈనెల 16వ తేదీ వరకు కొత్తగా ఓటరుగా నమోదు కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. ఓటరు అనుబంధ జాబితాను ఈనెల 25వ తేదీన వెల్లడించనున్నారు. ఈ జాబితాలో చోటు దక్కిన వారందరూ మే 13వ తేదిన జరిగే పోలింగ్‌లో ఓటు హక్కు వినియోగించుకోవడానికి అవకాశం ఉంటుంది. జిల్లాలో నూతనంగా ఓటరు నమోదకు ఫారం-6, ఓటరు చిరునామ మార్చుకోవడానికి ఫారం-8 ద్వారా దరఖాస్తులను స్వీకరించారు. ఇందులో ఓటరు నమోదు కోసం జగిత్యాల నియోజకవర్గంలో 14,268, కోరుట్ల నియోజకవర్గంలో 13,918 దరఖాస్తులు వచ్చాయి. సంబంధిత దరఖాస్తులు అధికారుల పరిశీలనలో ఉన్నాయి. ఈ ప్రక్రియ పూర్తయితే జిల్లాలో ఓటర్ల సంఖ్య మరింత పెరగనుంది.

● 785 పోలింగ్ స్టేషన్లు...

జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి నియోజకవర్గాల్లో 785 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో కోరుట్లలో 362, జగిత్యాలలో 254, ధర్మపురిలో 269 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. జిల్లావ్యాప్తంగా 138 క్రిటికల్ పోలింగ్ స్టేషన్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అదేవిధంగా సుమారు 400కు పైగా వాహనాలను ఎన్నికల కోసం ఉపయోగిస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ కోసం జిల్లావ్యాప్తంగా సుమారు 4,600 మంది ఉద్యోగులు, సిబ్బంది సేవలను వినియోగించుకుంటున్నారు. జిల్లాలో 18 మంది అధికారులతో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, 18 మంది అధికారులతో స్టాటిక్ సర్వేలైన్ బృందాలు, 18 మంది అధికారులతో మోడల్ కండక్ట్ ఆఫ్ కోడ్ బృందాలు, ఆరుగురితో వీడియో వ్యూయింగ్ బృందాలు, 91 మంది సెక్టోరల్ అధికారులు విధులు నిర్వహిస్తున్నారు.

● అప్రమత్తత అవసరం...

నామినేషన్ల సమర్పణ వ్యవహారంలో అభ్యర్థులు, పార్టీలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ప్రతీ అభ్యర్థి ఫారం- 2ఎ దాఖలు చేయాల్సి ఉంటుంది. ఒక అభ్యర్థి నాలుగు సెట్ల నామినేషన్లను దాఖలు చేయవచ్చు. వాటిని అభ్యర్థి లేదా అభ్యర్థి తరఫున ఎవరైనా దాఖలు చేయడానికి వీలుంది. ప్రతీ అభ్యర్థి తమపై ఉన్న క్రిమినల్ కేసులు, ఆస్తులు, అప్పులు, విద్యార్హతలకు సంబంధించి ఫారం -26ను సమర్పించాల్సి ఉంటుంది. పోటీచేసే అభ్యర్థి అదే నియోజకవర్గానికి చెందిన వారు కాకపోతే తాను ఏ నియోజకవర్గానికి ఓటరో సంబంధిత సర్టిఫికేట్ కాపీని సంబంధిత ఆర్వో నుంచి తీసుకువచ్చి దాఖలు చేయాల్సి ఉంటుంది. అభ్యర్థులు తమ ఎన్నికల ఖర్చు వివరాల కోసం ప్రత్యేకంగా బ్యాంకు అకౌంట్ ఓపెన్ చేయాలి.

● తేదీలు ఖరారు చేసుకున్న అభ్యర్థులు...

నిజామాబాద్ లోక్‌సభ స్థానానికి నామినేషన్లు దాఖలు చేయడానికి ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు తేదీలను ఖరారు చేసుకున్నారు. జగిత్యాలకు చెందిన ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ తరఫున అభ్యర్థిగా రంగంలోకి దిగుతున్నారు. జీవన్‌రెడ్డి ఈనెల 22వ తేదిన నామినేషన్‌ను దాఖలు చేయడానికి నిర్ణయించుకున్నారు. నామినేషన్ రోజుననే నిజామాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డితో బహిరంగ సభ నిర్వహించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన ఇంకా ఖరారు కావాల్సి ఉంది. బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ రెడ్డి ఈనెల 19వ తేదీన నామినేషన్‌ను దాఖలు చేయనున్నారు. నిజామాబాద్‌లోని పాత కలెక్టరేట్ గ్రౌండ్‌లో సుమారు 25 వేల మందితో సభను నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు. ఈ సభకు బీఆర్ఎస్‌కు చెందిన మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు హాజరుకానున్నారు. బీజేపీ అభ్యర్థిగా పోటీ చేయనున్న సిటింగ్ ఎంపీ ధర్మపురి అరవింద్ ముహూర్తం కారణంగా ఈనెల 19వ తేదీన, అనంతరం ఈనెల 25వ తేదీన ఆర్భాటంగా నామినేషన్లను దాఖలు చేయడానికి నిర్ణయించుకున్నారు. బీజేపీ ముఖ్య నాయకులను ఆహ్వానించి 25వ తేదీన నామినేషన్‌ను సమర్పించడానికి పార్టీ వర్గాలు ప్రయత్నిస్తున్నాయి.

పకడ్బందీగా ఎన్నికలు నిర్వహణ: షేక్ యాస్మిన్ బాషా, కలెక్టర్



జిల్లాలో పకడ్బందీగా ఎన్నికలను నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశాము. ఇందుకు అవసరమైన పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, ఎన్నికల సిబ్బంది శిక్షణ తదితర వాటిని ఇప్పటికే పూర్తి చేశాము. ఎన్నికలను ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించనున్నాము. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి.

నిరంతరం పర్యవేక్షిస్తున్నాము: సన్‌ప్రీత్ సింగ్, ఎస్పీ



పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ప్రత్యేకమైన నిఘాను ఏర్పాటు చేశాము. పలు ప్రాంతాల్లో చెక్ పోస్టులను ఏర్పరిచి తనిఖీలు నిర్వహిస్తున్నాము. నిరంతరం పర్యవేక్షణ జరుపుతున్నాము. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నాము.

హత్యాయత్నం కేసు నమోదు

రాయికల్, ఏప్రిల్ 17: మండలంలోని ఇటిక్యాలకు చెందిన అరికుప్పల అంజయ్య గంగాధర్‌లు అన్నదమ్ములు. వీరి మధ్య కొంతకాలంగా ఇళ్ల పంపకాల విషయంలో తగాదాలు నడుస్తున్నాయి. ఈ క్రమంలో ఈ నెల 16న సాయంత్రం అన్న అంజయ్య తన తమ్ముడు గంగాధర్‌పై కమ్మ కత్తితో దాడిచేయగా గాయాలయ్యాయి. గంగాధర్ కూతురు రాణి ఫిర్యాదు మేరకు అంజయ్యపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్సై అజయ్ తెలిపారు.

బస్ షెల్టర్ ప్రారంభం

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 17: మండలంలోని గుల్లపేటలో కొంగరిపెద్ద లింగారెడ్డి, కిష్టవ్వ జ్ఞాపకార్థం నిర్మించిన బస్‌షెల్టర్‌ను ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తనయుడు రాంచంద్రరెడ్డి బుధవారం ప్రారంభించారు. నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

వెలసిన శ్రీరాముని విగ్రహం

రాయికల్, ఏప్రిల్ 17: మండలంలోని అల్లీపూర్, సింగరావుపేట గ్రామాల మధ్య ఉన్న రాములోరి బిలుకుపై శ్రీరాముని విగ్రహం బుధవారం వెలిసింది. ఈ సందర్భంగా విగ్రహానికి గ్రామస్థులు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అల్లీపూర్ మాజీ సర్పంచ్ బాలె శోభారాణి, మాజీ ఎంపీటీసీ బాలె చంద్రశేఖర్, మాల్యావు మురళి, బర్ల లవణ్, వేముల సతీష్, వేణురావు తదితరులు పాల్గొన్నారు.

● రాయికల్ మండలంలోని అయోధ్య సీతారామునికి సింగరావుపేట గ్రామానికి చెందిన నాగేంద్రచారి అనే కళాకారుడు స్వర్ణ సూర్య తిలకాన్ని తయారు చేసి స్వామివారికి అలంకరించారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని అయోధ్యలో సూర్య కిరణాలతో సీతారామునికి తిలకాన్ని అందించగా ఇక్కడ స్వర్ణ తిలకాన్ని అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా నాగేంద్రచారిని పలువురు అభినందించారు.

పిచ్చి కుక్కల స్వైర విహారం

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 17: రామగుండం కార్పొరేషన్‌లో పిచ్చి కుక్కల స్వైర విహారం రోజురోజుకు పెరుగుతోంది. బుధవారం 26వ డివిజన్ మార్కండేయకాలనీలో ఓ పిచ్చి కుక్క ఎనమిది మందిపై దాడి చేసింది. ఇందులో నలుగురు చిన్నారులు ఉన్నారు. ఈ పది రోజుల్లో ఆయా కాలనీల్లో 20మంది పిచ్చి కుక్కల బారిన పడ్డారు. మార్కండేయకాలనీలో బుధవారం రోడ్డుపై నడిచివెళుతున్న వారిపై కుక్కలు దాడి చేశాయి. తీవ్రంగా గాయపడిన 8మంది గోదావరిఖని ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందారు. రామగుండం కార్పొరేషన్‌లో ఒకవైపు కుక్కల బెడద మరోవైపు కోతుల స్వైరవిహారంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు.

కిరాణంలో మద్యం నిల్వలు : కేసు నమోదు

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 17: కోరుట్ల మున్సిపల్ పరిధిలోని ఎఖీన్‌పూర్‌లో బుధవారం పోలీసులు ఓ కిరాణం దుకాణంలో మద్యం నిల్వలను గుర్తించారు. గ్రామానికి చెందిన గోపి అనే వ్యక్తి కిరాణం నిర్వహిస్తూ అందులోనే మద్యం విక్రయిస్తున్నాడని గుర్తించారు. కిరాణంలో నిల్వ ఉన్న సుమారు 6,500 రూపాయల మద్యం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

జగిత్యాలలో జోరుగా వ్యభిచారం

- బాలికలతో వ్యాపారం కొనసాగిస్తున్నారని గుర్తించిన పోలీసులు
- నోటీసులు జారీ చేసిన తహసీల్దార్

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 17: జగిత్యాల జిల్లా కేంద్రంలోని జగిత్యాల-నిజామాబాద్ రహదారిలో ఉన్న ఓ ప్రాంతంలో కొన్ని రోజులుగా జోరుగా వ్యభిచారం నిర్వహిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ప్రధాన రహదారి పక్కన ఉన్న ఇంటిలో కొంత మంది ఇతర ప్రాంతాల నుంచి మహిళలు, బాలికలను ఇక్కడకు తీసుకువస్తూ వ్యభిచార రొంపిలోకి దించుతూ సొమ్ముచేసుకుంటున్నారు. అయితే జోరుగా వ్యభిచారం జరుగుతుందనే అనే సమాచారంతో పట్టణ పోలీసులు ఈ ప్రాంతంలో దాడులు నిర్వహించగా ఓ బాలిక వ్యభిచారం చేస్తూ పట్టుబడినట్లు తెలిసింది. దీంతో పోలీసులు, రెవెన్యూ అధికారులు జాయింట్ ఆపరేషన్ నిర్వహించారు. గాంధీనగర్ ప్రాంతంలో ఓ మహిళ వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. బాలికతో పాటు మహిళలతో వ్యభిచారం చేయిస్తూ సొమ్ము చేసుకోవడంతో పాటు ప్రజారోగ్యానికి హానికరంతో పాటు అనైతిక చర్యగా పాల్పడుతున్నట్లు భావించారు. దీంతో రెవెన్యూ అధికారులు సెక్షన్ 133 సీఆర్‌పీసీ కింద నిర్వాహకురాలికి నోటీసులు జారీ చేశారు. బుధవారం జగిత్యాల డీఎస్పీ రఘుచందర్‌తో పాటు సీఐ వేణుగోపాల్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది సంబంధిత ఇంటిని గుర్తించి నోటీసును అతికించారు. మూడు రోజుల్లో దీనిపై సమాధానం ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నారు.

చెరువులో మునిగి యువకుడి మృతి



రోదిస్తున్న కుటుంబీకులు(ఇన్‌సెట్‌లో సాయి(ఫైల్))

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 17: మూగ జీవాన్ని కాపాడబోయిన యువకుడు ఈత రాకపోవడంతో చెరువులో మునిగి ప్రాణాలను ఒదిలాడు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన మిర్యాల్‌కార్ సాయికుమార్ (23) తండ్రి మాంసం విక్రయిస్తాడు. ఈ క్రమంలో తమకున్న మేకలు, గొర్రెలను మేత కోసం తండ్రి కిషన్‌తో కలిసి సాయికుమార్ గ్రామ శివారులోని గిద్దె చెరువు ప్రాంతానికి వెళ్లారు. ఓ మేక చెరువులోకి వెళ్లడంతో గమనించిన సాయికుమార్ కాపాడేందుకు చెరువులోకి దిగాడు. లోనికి దిగుతున్న తరుణంలో పెద్ద గోతిలో పడిపోయాడు. ఈత రాకపోవడంతో నీట మునిగి మృతి చెందాడు. సమీపంలో ఉన్న తండ్రి గమనించి తన కొడుకు చెరువులో మునిగిపోయాడని, రక్షించాలంటూ కేకలు వేశాడు. చుట్టు పక్కల వారితోపాటు అక్కడకు చేరుకున్న యువకులు కొత్త రాజు, కుంచం రవి, గౌరీశంకర్, శ్రీనివాస్ చెరువులోకి దిగి గాలించారు. ఈ క్రమంలో శ్రీనివాస్ నీట మునుగుతుండగా గౌరీశంకర్ గమనించాడు. వెంటనే అప్రమత్తమై అతడిని కాపాడి ఒడ్డుకు చేర్చాడు. మరో ప్రాణం పోకుండా రక్షించాడు. అనంతరం సుమారు 30 నిమిషాల పాటు సాయికుమార్ మృతదేహం కోసం గాలించారు. చివరకు సాయికుమార్ మృతదేహాన్ని వెలికి తీశారు. యువకులను స్థానికులు అభినందించారు. మృతుడి తండ్రి కిషన్ ఫిర్యాదుతో కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమాకాంత్ తెలిపారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఆరె కటిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు మిర్యాల్‌కార్ శ్రీనివాస్, సభ్యులు కోరారు.

అంజన్న సేవలో న్యాయమూర్తులు



కొండగట్టు అంజన్న సన్నిధిలో న్యాయమూర్తులు

మల్యాల, ఏప్రిల్ 17: కొండగట్టు ఆంజనేయస్వామిని బుధవారం వేములవాడ, సిరిసిల్లా, కరీంనగర్, మంచిర్యాల కోర్టుల న్యాయమూర్తులు జ్యోతి, ప్రవీణ్ కుమార్, హేమలత, స్వాతి దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన న్యాయమూర్తులు స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.

ఇంట్లో చోరీకి పాల్పడ్డ నిందితుల రిమాండ్

కథలాపూర్, ఏప్రిల్ 17 : మండలంలోని తక్కళ్ళపల్లిలో నక్క సతీష్ ఇంట్లో చోరీకి పాల్పడ్డ నలుగురు నిందితులను బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్టు ఎస్సై నవీన్ తెలిపారు. ఇంట్లో ఎవరూలేని సమయంలో బోధన్‌కు చెందిన ఒడిబిడి పోషెట్టి అతని భార్య లక్ష్మీ, బింగి గంగమణి, జావెద్ ఖాన్ చొరబడి మూడువేల నగదు ఎత్తుకెళ్లారని వారిని పట్టుకుని రికవరీ చేసినట్టు చెప్పారు. మరో వ్యక్తి పరారీలో ఉన్నాడని చెప్పారు. వీరు జగ్గాసాగర్, వేల్పూరు గ్రామాల్లో దొంగతనాలకు పాల్పడినట్టు అంగీకరించారని అరెస్ట్ చేసి కోరుట్ల మున్సిఫ్ మెజిస్ట్రేల్ ముందు హాజరుపరిచామని ఎస్సై తెలిపారు.

వడదెబ్బతో యువకుడి మృతి



రవికుమార్(ఫైల్)

జ్యోతినగర్, ఏప్రిల్ 17: పెద్దపల్లి జిల్లా రామగుండం కార్పొరేషన్ పరిధిలోని జంగాలపల్లికి చెందిన మేకల రవికుమార్(32) అనే యువకుడు వడదెబ్బకు గురై బుధవారం మృతిచెందాడు. మంగళవారం తన పశువులను మేపేందుకు వెళ్లిన రవికుమార్ వడదెబ్బకు గురయ్యాడు. తీవ్ర అస్వస్థతకు గురైన అతడికి ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ రవికుమార్ మృతి చెందినట్లు ఎన్టీపీసీ పోలీసులు తెలిపారు. పాల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్న రవికుమార్ అవివాహితుడు. మృతుడి తండ్రి మేకల లింగయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎన్టీపీసీ ఏఎస్‌ఐ రయీస్ అహ్మద్ తెలిపారు.

విద్యుదాఘాతంతో గడ్డివాము దగ్ధం

ఓదెల, ఏప్రిల్ 17 : మండలంలోని కొలనూర్‌లో బుధవారం కర్రే లక్ష్మారెడ్డి అనే రైతుకు చెందిన గడ్డివాము విద్యుత్ ఘాతంతో దగ్ధమైంది. గ్రామస్తులు పెద్దపల్లిలోని అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో తరలివచ్చి మంటలను ఆపివేశారు. ఈ సంఘటన వల్ల దాదాపు రూ.40వేల మేరకు నష్టం వాటిల్లిందని బాధిత రైతు తెలిపాడు.

జమ్మికుంటలో కారు..



జమ్మికుంటలో కాలిపోయిన కారు

జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 17: జమ్మికుంట పట్టణంలోని కోరపల్లి రోడ్డులో నివాసం ఉంటున్న ఓంసాయి అనే మతి స్థిమితం లేని యువకుడు బుధవారం మధ్యాహ్నం ఇంటి వద్ద ఉన్న తన తండ్రి కారును దగ్ధం చేశాడు. కారులో నుంచి మంటలు రావడాన్ని కుటుంబ సభ్యులు గమనించి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి సిబ్బంది చేరుకుని మంటలు ఆర్పివేశారు. యువకుడి తల్లి మాట్లాడుతూ ఐదేళ్లుగా తన కుమారుడి ఆరోగ్యం బాగలేదని, ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నామని తెలిపారు. అప్పటి నుంచి మతి స్థిమితం లేకుండా ప్రవర్తిస్తున్నాడని, కారు ఎందుకు తగులబెట్టావని అడిగితే చెప్పడం లేదని తెలిపారు.

గుడుంబా ప్యాకెట్లు పట్టివేత

వీణవంక, ఏప్రిల్ 17: మండల కేంద్రంలోని బస్టాండు ప్రాంతంలో అనుమానాస్పదంగా కనిపించిన ఇల్లంతకుంట మండలం మాల్యాల గ్రామానికి చెందిన తిరుపతిసురేష్, శంకరపట్నం మండలం మెట్‌పల్లి గ్రామనికి చెందిన అంగిడి సమ్మయ్యను తనిఖీలు చేయగా గుడుంబా ప్యాకెట్స్ పట్టుబడ్డాయని ఎస్సై తిరుపతి తెలిపారు. సుమారు ఐదున్నర లీటర్ల గు డుంబా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామని, వాటి విలువ 1,650 రూపా యలు ఉంటుందని తెలిపారు. ఇద్దరిపై పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

శంకరపట్నం: శంకరపట్నం మండలంలోని కల్వల గ్రామ శివారులో బుధవారం గుడుంబా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై పాకాల లక్ష్మారెడ్డి తెలిపారు. ఆమెట్‌పల్లి గ్రామానికి చెందిన అంగిడి సమ్మయ్య అనే వ్యక్తి కల్వల గ్రామ శివారులో గుడుంబా తయారు చేస్తున్నాడని వచ్చిన సమాచారం మేరకు దాడులు చేశామని చెప్పారు. ఈ మేరకు గుడుంబా సామగ్రిని ధ్వంసం చేసినట్లు తెలిపారు. సమ్మయ్య నుంచి 40 గుడుంబా ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

సైదాపూర్, ఏప్రిల్ 17: మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను బుధవారం పోలీసులు పట్టుకున్నారు. ఎలబోతారం గ్రామంలోని గొడిశాల క్రాసింగ్ వద్ద ఎస్సై జన్ను ఆరోగ్యం ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేశారు. ఆ సమయంలో వీణవంక మండలం జంగపల్లి గ్రామానికి చెందిన మూ డు ట్రాక్టర్లు మానేరు వాగునుంచి అక్రమంగా తీసుకొని వెళ్తుండడంతో పట్టుకున్నామని ఎస్సై చెప్పారు. ఆ ఇసుక ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి యజమానులు, డ్రైవర్లపై కేసు నమోదు చేశామని తెలిపారు.

అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు

గన్నేరువరం, ఏప్రిల్ 17: అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిపై గన్నేరువరం పోలీసులు కేసు నమోదు చేశారు. బెజ్జంకి మండలం వడ్లూరు గ్రామానికి చెందిన పల్లె సంతోష్ అనే బెల్ట్‌షాప్ నిర్వహకుడు బుధవారం గన్నేరువరం నుంచి రూ.21,712 విలువ గల మద్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా మైలారం ఎక్స్ రోడ్ వద్ద ఎస్సై తాండ్ర నరేష్ పట్టుకున్నారు. మద్యాన్ని స్వాధీనం చేసుకొని సంతోష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా మద్యాన్ని తరలించినా, బెల్‌షాపులు నిర్వహించినా కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మానకొండూర్, ఏప్రిల్ 17: మండలంలోని ఈదులగట్టెపల్లి బస్టాండ్ సమీపంలో గల కాకతీయ కాల్వ వద్ద బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారి ప్రక్కన గల కాకతీయ కాల్వ వద్ద అనుమానాస్పద స్థితిలో సుమారు 40 సంవత్సరాల లోపు గల గుర్తు తెలియని వ్యక్తిగా స్థానికులు గుర్తించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు.

మియాపూర్‌లో అగ్నిప్రమాదం



అగ్నిప్రమాదంలో దగ్ధమైన ఇల్లు

సుల్తానాబాద్, ఏప్రిల్ 17: మండలంలోని మియాపూర్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో ఓ ఇల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన ఎర్రంశెట్టి లచ్చయ్య, శశిరేఖ దంపతులు కూలీపని చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. బుధవారం ఉదయం శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని ఇంట్లో దీపం వెలిగించి పూజలు చేసుకుని ర్యాకల్‌దేవ్‌పల్లి జాతరకు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేకపోవడం, ఇంటినుంచి పొగ రావడాన్ని చుట్టుపక్కల వారు గమనించారు. మంటలు ఎక్కువై ఇంట్లో ఉన్న వస్తువులన్నీ అగ్నికి ఆహుతయ్యాయి. చుట్టుపక్కల వారు అప్రమత్తమై మంటలను ఆర్పివేశారు. ప్రమాదం గురించి బాధితులకు సమాచారం అందించగా వారు వచ్చి బోరున విలపించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ సర్పంచ్ కొయ్యడ స్వప్నఅరుణ్ కోరారు.

కార్మికులు ఆత్మహత్య చేసుకున్నా

ప్రభుత్వంలో చలనం లేదు



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి వేణు

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 17: సిరిసిల్లలో వస్త్ర పరిశ్రమ సంక్షోభంతో ఉపాధి లేక ఇద్దరు కార్మికులు ఆత్మహత్య చేసుకున్నా రాష్ట్ర ప్రభుత్వంలో చలనం లేక పోవడం దురదృష్టకరమని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు సంబంధించిన పెండింగ్ బిల్లులు, నూతన ఆర్డర్లు ఇవ్వకుంటే రాబోయే ఎన్నికల్లో ప్రజల నిరసనను ప్రభుత్వం ఎదుర్కోక తప్పదన్నారు. వస్త్ర పరిశ్రమ సంక్షోభాన్ని నివారించాలని ఆసాములు, కార్మికులు, యజమానులు, ప్రజా సంఘాలు జేఏసీగా ఏర్పడి ఆందోళనలు చేపట్టినట్లు చెప్పారు. మంత్రి పొన్నం ప్రభాకర్ జేఏసీ నాయకులతో చర్చలు జరిపి త్వరగా బతకమ్మ చీరల బకాయిలు చెల్లిస్తామన్నారన్నారు. ప్రభుత్వ ఆర్డర్లు ఇస్తామని స్పష్టమైన హామీనిచ్చి పది రోజులు గడుస్తున్నా అమలు కాకపోవడం దురదృష్టకరమన్నారు. వస్త్ర పరిశ్రమపై ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ దాదాపు 30 వేల మంది కార్మిక కుటుంబాలు ఆధారపడి ఉన్నాయన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఇచ్చిన హామీలను 48 గంటలో నిలబెట్టుకోవాలని కోరారు. సమావేశంలో సీపీఐ పట్టణ కార్యదర్శి పంతం రవి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, నాయకులు చంద్రమౌళి, సోమ నాగరాజు పాల్గొన్నారు.

అప్పుల బాధతో గల్ఫ్ కార్మికుడి బలవన్మరణం

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 17: మండలంలోని సంగెం గ్రామానికి చెందిన శనిగారపు మహేష్ (30) అనే గల్ఫ్ కార్మికుడు అప్పుల బాధతో మంగళవారం రాత్రి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహేష్ ఉపాధి నిమిత్తం మూడు సంవత్సరాల క్రితం గల్ఫ్ దేశమైన దు బాయ్ వెల్లగా అక్కడ సరైన పని దొరకపోవడంతో కొన్ని రోజుల క్రితం స్వగ్రామానికి తిరిగి వచ్చాడు. గల్ఫ్‌కు వెళ్లే సమయంలో మహేష్ బంధువుల వద్ద సుమారు నాలుగు లక్షల రూపాయల వరకు అప్పు చేశాడు. అప్పు ఇచ్చిన బంధువులు మహేష్‌ను డబ్బుల విషయంలో ఒత్తిడి చేయడంతో మనస్తాపంతో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కిరణ్‌కుమార్ తెలిపారు. మహేష్ భార్య నాలుగు నెలల గర్భవతి అని గ్రామస్థులు తెలిపారు.

పెళ్లి చేసుకొమ్మన్నందుకు యువకుడి ఆత్మహత్య



యోగేశ్(ఫైల్)

కథలాపూర్, ఏప్రిల్ 17: వయసు మీరిపోతోంది పెళ్లి చేసుకుని ఓ ఇంటి వాడివి కావాలని కుటుంబ సభ్యులు కోరగా మనస్తాపం చెందిన యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై నవీన్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని భూషణరావుపేటకు చెందిన రాసమల్ల యోగేశ్ (28) అనే యువకుడు హెయిర్ సెలూన్ నడుపుకుంటూ ఉపాధి పొందుతున్నాడు. అయితే ఇంట్లో వారు పెళ్లి చేసుకోమని కోరుతుండగా తాను ఇప్పుడే పెళ్లి చేసుకోనంటూ చెబుతూ వచ్చాడు. వారం రోజుల కిందట మనస్తాపం చెందిన యోగేశ్ పురుగుల మందు తాగడం తో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. దీంతో ఎల్లారెడ్డిపేటలోని ఓ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

ఇన్సూరెన్స్ లేని స్కూల్ వ్యాన్

- విద్యార్థుల జీవితాలతో చెలగాటం
- బాధిత కుటుంబసభ్యుల ఆందోళన



ప్రమాదానికి కారణమైన స్కూల్ వ్యాన్

మల్యాల, ఏప్రిల్ 17: విద్యార్థులను తరలించే స్కూల్ వ్యాన్‌ను ఇన్సూరెన్స్ లేకుండా నడుపుతున్న ప్రైవేట్ స్కూల్ యాజమాన్య నిర్లక్ష్యానికి ఓ చిన్నారి బలి అయింది. మండలంలోని మద్దుట్లలో రామన్నపేటకు చెందిన శ్రీసరస్వతీ విద్యానికేతన్ స్కూల్ వ్యాన్ ముందు టైర్లు ఎక్కడంతో చిన్నారి అరీబా(18నెలలు) మృతి చెందడం గ్రామంలో విషాదం నింపింది. కాగా బుధవారం మృతి చెందిన చిన్నారి కుటుంబసభ్యులు పాఠశాల యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ స్కూల్ ముందు చిన్నారి మృతదేహంతో ఆందోళనకు సిద్ధం అయ్యారు. స్కూల్ వ్యాన్‌కు ఇన్స్‌రెన్స్ లేకపోవడంతో మండిపడ్డారు. మద్దుట్లకు చెందిన నాయకులు కూడా స్కూల్ యాజమాన్యంపై అసంతృప్తి వ్యక్తం చేయడంతో పాఠశాల నిర్వహకులు, ప్రైవేట్ స్కూల్స్ సంఘ నాయకులు చిన్నారి ఇంటికి వచ్చి మాట్లాడారు. స్కూల్ వ్యాన్‌కు ఇన్స్‌రెన్స్ ఉంటే తమకు మేలు జరిగేదని లేకపోవడంతో నష్టపోవాల్సి వస్తుందని ఈ సందర్భంగా చిన్నారి బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ఇన్స్‌రెన్స్ లేకపోవడంతో పరిహారంగా రెండు విడతల్లో రూ.5.5లక్షల చెల్లింపునకు పాఠశాల యాజమాన్యం ఒప్పుకున్నారని, దీంతో చిన్నారి కుటుంబసభ్యులు ఆందోళన విరమించినటు తెలిపారు. కాగా స్కూల్ వ్యాన్ ఇన్సూరెన్స్ వివరాలు తెలుసుకునేందుకు నిర్వహకులు సత్యనారాయణరావును సెల్‌ఫోన్‌లో సంప్రదించగా లిఫ్ట్ చేయలేదు.

● వాహనాల పత్రాలపై నిర్లక్ష్యం..

స్కూల్ విద్యార్థులను తరలించే వాహనాల ఇన్స్‌రెన్స్, ఫిట్‌నెస్, ట్యాక్స్ తదితర అన్ని రకాల పత్రాలు రవాణాశాఖ అధికారులు తరచూ తనిఖీలు చేయాల్సి ఉంటుండగా.. మద్దుట్లలో ప్రమాదానికి కారణమైన స్కూల్‌వ్యాన్‌కు ఇన్సూరెన్స్ లేకపోవడాన్ని అధికారుల తనిఖీల లోపంగా మద్దుట్ల వాసులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్కూల్ విద్యార్థులను తరలించే వాహనాలను పకడ్బందీగా తనిఖీలు చేసి తగు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. విద్యాశాఖ అధికారులు కూడా స్పందించాలని కోరుతున్నారు.

అన్ని వర్గాల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం



కాంగ్రెస్‌లో చేరిన మహిళలతో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 17: అన్ని వర్గాల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని ఎమ్మెల్సీ, కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డి అన్నారు. జగిత్యాల రూరల్ మండలం తాటిపెల్లి గ్రామానికి చెందిన 300 మందితో పాటు సీనియర్ న్యాయవాది ప్రతాప్ తదితరులు బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరగా ఎమ్మెల్సీ కండువాలు కప్పారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా అండగా నిలబడి ఎంపీగా ఆశీర్వదించాలని కోరారు. ఈ నెల 22న నిర్వహించనున్న నామినేషన్ ప్రక్రియకు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. రైతు సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన ధ్యేయం అని పేర్కొన్నారు. రానున్న ఖరీఫ్ నాటికి రూ. 2 లక్షల రుణమాఫీ చేసి తీరుతామని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండల అధ్యక్షుడు జున్ను రాజేందర్, నాయకులు రమేష్ బాబు, గాజెంగి నందయ్య, రాదాకిషన్ రావు, నారాయణ, మల్లేశం, గంగారెడ్డి తదితరులు ఉన్నారు.

బిహార్ కూలీలతో ధాన్యం తూకం ప్రారంభం

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

కథలాపూర్, ఏప్రిల్ 17: వరి కోతలు కోసి కేంద్రాల్లో నిరీక్షిస్తున్న రైతుల ఇబ్బందులపై ఈ నెల 17న 'హమాలీలు లేక.. కొనుగోళ్లు సాగక' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. బుధవారం బిహార్ కూలీలతో ధాన్యం తూకం వేయించారు. 20 మంది హమాలీలను తెప్పించి కొనుగోళ్లు వేగవంతం చేస్తున్నామని సెర్ప్ అధికారులు తెలిపారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కొనుగోలు కేంద్రాల్లో రైతులకు వసతులు కల్పించాలి

కథలాపూర్, ఏప్రిల్ 17: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని రకాల వసతులు కల్పించాలని జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేశ్వర్‌రావు సూచించారు. బుధవారం మండలంలోని చింతకుంట, భూషణరావుపేట, గంభీర్‌పూర్, తాండ్ర్యాల గ్రామాల్లో ప్యాక్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. నీడ, మంచినీరు, తాత్కాలిక మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులు కల్పించాలన్నారు. ప్యాడీ క్లీనర్లతో ధాన్యం శుద్ధి చేసి ప్రభుత్వం సూచిం చిన విధంగా తూకం వేయాలని పేర్కొన్నారు. విద్యుత్ సదుపాయం ఏర్పాటు చేసుకుని ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు రైతులకు టోకెన్లు ఇస్తూ రిజిస్టర్లు నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా సీఈవోలు విజయ్, అరుణ్, సిబ్బంది ఉన్నారు.

నియామకం

మెట్‌పల్లి, ఏప్రిల్ 17: మెట్‌పల్లి పట్టణానికి చెందిన నిజాముద్దీన్‌ను తెలంగాణ ప్రదేశ్ దోహాఖతార్ కన్వీనర్‌గా చైర్మన్ డాక్టర్ వినోద్ అందజేసిన నియామకపత్రాన్ని సీఎం రేవంత్‌రెడ్డి చేతులు మీదుగా స్వీకరించారు. బుధవారం పట్టణంలోని మిత్రులు హర్షం వ్యక్తం చేస్తూ నిజాముద్దీన్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా నిజాముద్దీన్ మాట్లాడుతూ నాయకుల సహకారంతో గల్ఫ్ బాధితుల సంక్షేమానికి కోసం పోరాడుతన్నారు. కార్యక్రమంలో మిత్రబృందం కొత్త నవీన్, పిట్ల రాంప్రసాద్, అఖిల్, మతిన్, నాగరాజు, రవీందర్, రాజేందర్, మహేష్, మహమ్మద్ అజరుద్దీన్, పవన్, శ్రీకాంత్, శ్రీనాథ్, మొయినుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాల మీదుగా రైల్వేలైన్ ఏర్పాటు చేయాలి

జగిత్యాల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మీదుగా మంచిర్యాల-మనోహరాబాద్ రైల్వే లైన్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ ప్రధాని నరేంద్రమోదీకి పట్టణానికి చెందిన ది హార్ట్ ఆఫ్ ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకుడు దేవరశెట్టి జనార్దన్ బుధవారం లేఖను రాశారు. జగిత్యాల ప్రాంత ప్రజలు హైదరాబాద్ వెళ్లాలంటే కరీంనగర్ నుంచి వేములవాడ, సిద్దిపేట ద్వారా హైదరాబాద్ వెళ్లాల్సి ఉంటుందన్నారు. లేదంటే నిజామాబాద్ ద్వారా సుమారు ఏడు గంటల ప్రయాణం చేయాల్సి వస్తోందని వివరించారు. ఈ రెండు మార్గాలు సైతం జగిత్యాల ప్రాంత ప్రజలకు దూరభారం అవుతోందని, విలువైన కాలాన్ని, డబ్బును కోల్పోవలసి వస్తోందని వాపోయారు. వేములవాడ రైల్వే లైన్‌ను కొండగట్టు, జగిత్యాల నుంచి ధర్మపురి, గూడెం సత్యనారాయణస్వామి దేవస్థానం, కోటిలింగాల దేవాలయాలను అనుసంధానించి మంచిర్యాలకు కలిపితే నాలుగు అతిప్రాచినమైన టెంపుల్ కారిడార్ మార్గంగా మారే అవకాశాలున్నాయని లేఖలో కోరారు. టెంపుల్ కారిడార్ ద్వారా పర్యాటక రంగం అభివృద్ధి చెందడమే కాకుండా వ్యాపార, వాణిజ్య, వ్యవసాయ, పారిశ్రామిక అభివృద్ధి సైతం జరుగుతుందని, సత్వరమే చర్యలు తీసుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీని కోరారు.

వివాహిత ఆత్మహత్య

వెల్గటూర్, ఏప్రిల్ 17: మండలంలోని కిషన్‌రావుపేట గ్రామానికి చెందిన బండారి సత్తవ్వ (40) అనే వివాహిత బుధవారం జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నది. ఎస్సై ఉమాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం మృతురాలు సత్తవ్వ కొన్ని రోజులుగా నరాల నొప్పితో బాధ పడుతుతోంది. ఈ క్రమంలో మంగళవారం రాత్రి అందరూ భోజనం చేసి పడుకున్న తరువాత ఇంటి సమీపంలో గల వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నది. బుధవారం మృతదేహాన్ని బావిలో నుంచి తీసి పోస్ట్ మార్టం నిర్వహించారు. మృతురాలు సత్తవ్వ భర్త మల్లేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై ఉమాసాగర్ వివరించారు.

భూములు కోల్పోతున్నవారికి అండగా ఉంటాం



పరిశీలిస్తున్న జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 17: నేషనల్ హైవే రోడ్డు విస్తరణలో భూములు కోల్పోతున్నవారికి అండగా ఉంటామని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ బాధితులకు భరోసా కల్పించారు. జగిత్యాల రూరల్ మండలం అంతర్గాంలో నేషనల్ హైవే రోడ్డు విస్తరణలో కోల్పోతున్న భూములను ఎమ్మెల్యే బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అంతర్గాం నుంచి జాతీయ రహదారి 563 నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా వారు సర్వే చేశారన్నారు. గ్రామంలో 45 పైగా ఇళ్లు, 100 మందిపైన రైతులు భూమి కోల్పోయే అవకాశం ఉందన్నారు. గ్రామం పక్క నుంచే నేషనల్ హైవే వెళ్తున్నందున జగిత్యాల, మేడిపెల్లి, మల్యాల, కొండగట్టు వరకు రద్దీ ఉండడం వల్ల అంతర్గాం వద్ద పై ఓవర్ ఏర్పాటు చేయాలని, అండర్‌పాస్‌లు నిర్మించాలన్నారు. రీ సర్వే చేసి 100 ఫీట్లు మించకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నారాయణ, నక్కల రవీందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పులకించిన భద్రగిరి



భద్రగిరి పులకించింది.. భక్తకోటితో హోరెత్తింది. పవిత్ర పుణ్యక్షేత్రం భద్రాచలంలో బుధవారం సీతారాముల కల్యాణ వేడుక అంగరంగ వైభవంగా సాగింది. తెల్లవారుజాము నుంచే మొదలైన వేడుక మధ్యాహ్నం ముత్యాల తలంబ్రాలతో ముగిసింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున చీఫ్ సెక్రటరీ శాంతికుమారి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సుప్రీంకోర్టు న్యాయమూర్తి పీఎస్ నరసింహ, హైకోర్టు అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, ఐజీ ఏవీ రంగనాథ్, టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు, దేవనాథ రామానుజ జీయర్‌స్వామి తదితరులు తరలివచ్చి కల్యాణ వేడుకను తిలకించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలిరావడంతో భద్రాచలం కోలాహలంగా మారింది. -భద్రాచలం

కన్నుల పండువగా సీతారాముల కల్యాణ వేడుక



కల్యాణం వీక్షిస్తున్న మంత్రి సురేఖ, సీఎస్ శాంతికుమారి



పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



జీలకర్రబెల్లంను భక్తులకు చూపుతున్న దృశ్యం



స్వామివారి ఊరేగింపు



ద్వారకా తిరుమల దేవస్థానంవారి పట్టువస్త్రాలు



గౌతమీ నదిలో పుణ్య స్నానాలు



వైభవంగా సీతారాముల కల్యాణోత్సవం



ధర్మపురి మండలం దొంతాపూర్‌లో పాల్గొన్న భక్తులు



గొల్లపల్లిలో కల్యాణోత్సవంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ అడ్లూరి



మల్యాలలో నవమి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

ధర్మపురి, ఏప్రిల్ 17: ధర్మపురి మండలంలో శ్రీరామనవమి వేడుకలు బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మండలంలోని తిమ్మాపూర్, ధర్మపురి, దొంతాపూర్, రాజారం, జైనా గ్రామాల్లో, లక్ష్మీ నరసింహ కాలనీ, శాలపల్లె, తిమ్మాపూర్ గండి, దమ్మన్నపేట, రాయపట్నం, తీగలధర్మారం వద్ద గల ఆలయాల్లో సీతారామచంద్రస్వామి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, బీజేపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్ పాల్గొని పూజలు నిర్వహించారు. ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ దొంతాపూర్‌లో నిర్వహించిన అన్నదానం కార్యక్రమానికి రూ 1,16,000 విరాళాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, ధర్మపురి మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, వైస్‌చైర్మన్ ఇందారపు రామయ్య, ధర్మపురి, బుగ్గారం ఎంపీపీలు ఎడ్ల చిట్టిబాబు, బాదినేని రాజమణి, జడ్పీటీసీలు బత్తిని అరుణ, బాదినేని రాజేందర్, టీపీసీసీ సభ్యులు సంగనభట్ల దినేష్ పాల్గొన్నారు.

● మండలంలోని తిమ్మాపూర్‌లో నిర్వహించిన సీతారామచంద్ర స్వామి కల్యాణోత్సవానికి కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇంఛార్జ్ జువ్వాడి నర్సింగరావు తరపున ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు.

● ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనరసింహ స్వామి కాలనీలో నిర్వహించే శ్రీ సీతారాముల కల్యాణోత్సవానికి వెళ్లే భక్తుల కోసం మున్సిపల్ 11 వ వార్డు కౌన్సిలర్ జక్కు పద్మ-రవీందర్ ఉచిత వాహనాల సౌకర్యం కల్పించారు.

జగిత్యాలరూరల్: జగిత్యాలఅర్బన్, రూరల్ మండలాల్లో జరిగిన వేడుకల్లో వందలసంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జడ్పీచైర్‌పర్సన్ వసంత సురేష్ ఆయా గ్రామాల్లోని హన్‌మాన్ ఆలయాల్లో నిర్వహించిన సీతారాముల కళ్యాణోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రాయికల్: రాయికల్ పట్టణంతో పలు గ్రామాల్లో వేడుకలు నిర్వహించారు. మండలంలోని అల్లీపూర్, అయోధ్య, రాయికల్, రామాజీపేట, తాట్లవాయి గ్రామాల్లో జరిగిన సీతారాముల కల్యాణ వేడుకల్లో నిజామాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జీవన్‌రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. తాట్లవాయిలో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పాల్గొని పూజలు నిర్వహించారు. మండలంలోని అయోధ్యలో సీతారాముల కల్యాణానికి ప్రభుత్వం తరపున ఆర్ఐ పద్మయ్య దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు.

మల్యాల: మండలంలోని ముత్యంపేట, మల్యాల, రాజారం, మ్యాడంపెల్లి, తాటిపెల్లి తదితర గ్రామాల్లో వేద మంత్రోచ్ఛరణల మధ్య స్వామి వారి కళ్యాణాన్ని కన్నుల పండవగా నిర్వహించారు. ముత్యంపేట, నూకపల్లి, రాజారంలో జరిగిన సీతారాముల కళ్యాణ వేడుకల్లో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సీతారాముల కళ్యాణం వీక్షించారు.

కొడిమ్యాల: మండల కేంద్రంలోని పురాతన సీతారామచంద్రస్వామి ఆలయంలో, మండలంలోని పూడూర్ బ్రహ్మేంద్రస్వామి, వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో, హిమ్మతురావుపేట, శ్రీరాములపల్లి గ్రామాల్లో సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ప్రతాప్‌సింగ్ దంపతులు, కొడిమ్యాల మాజీ సర్పంచు ఏలేటి మమతనర్సింహరెడ్డి, నల్లగొండ లక్ష్మీనర్సింహస్వామి ఆలయ సిబ్బంది కమలాకర్, నర్సయ్య పాల్గొన్నారు.

సారంగాపూర్: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో, దుబ్బరాజన్న ఆలయంలో ఉత్సవాలు అంగరంగా వైభవంగా జరిగాయి. కార్యక్రమంలో ఆలయ ఈవో అనూష, చైర్మన్ పొరండ్ల శంకరయ్య, మాజీ సర్పంచ్‌లు, నాయకులు, ఆంజనేయ దీక్ష పరులు, భక్తులు పాల్గొన్నారు.

భీమారం: మండలంలోని మోత్కురావుపేట, గోవిందారం, పసునూరు, కమ్మరిపేట గ్రామాల్లో జరిగిన శ్రీరాముని కల్యాణ వేడుకల్లో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బుగ్గారం: బుగ్గారం మండల కేంద్రంలోని హనుమన్ ఆలయంలో 42 మంది హనుమన్ దీక్షాపరుల ఆధ్వర్యంలో కల్యాణాన్ని నిర్వహించారు. బుగ్గారం గ్రామానికి చెందిన ఎలగందుల శ్రీకాంత్-స్వాతి దంపతులు బహుకరించిన సీతారామలక్ష్మణ ఆంజనేయ ఉత్సవ విగ్రహాలతో కల్యాణ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

పెగడపల్లి: మండలంలోని నామాపూర్, నంచర్ల, అయిత్‌పల్లి, ఎల్లాపూర్ గ్రామాల్లోని సీతారామచంద్రస్వామి ఆలయాలు, పెగడపల్లి, బతికెపల్లి గ్రామాల్లోని రాజరాజేశ్వరస్వామి ఆలయాలలో సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. ప్రభుత్వ విప్ ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆయా ఆలయాలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పెగడపల్లిలో మాజీ సర్పంచ్ మేరుగు శ్రీనివాస్, నామాపూర్‌లో మాజీ ఎంపీటీసీ కొమురెల్లి ఆనందం కుటుంబ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు. జడ్పీటీసీ కాసుగంటి రాజేందర్ రావు, ఎంపీపీ గోళి శోభాసురెందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కథలాపూర్: మండలంలోని చింతకుంట, పోసానిపేట, పెగ్గెర్ల, దూలూరు, అంబారిపేట, బొమ్మెన గ్రామాల్లోని రామాలయాల్లో అర్చకులు కల్యాణం జరపగా భక్తులు కనులారా వీక్షించారు. హన్మాన్ దీక్షాస్వాములు సీతారాముల విగ్రహాలతో పురవీధుల వెంట ఊరేగింపుగా వెళ్లారు. కార్యక్రమాల్లో జడ్పీటీసీ నాగం భూమయ్య, ఎంపీపీ జవ్వాజి రేవతి, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు ఉన్నారు. వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మండలంలోని చింతకుంట, భూషణరావుపేట, పోసానిపేట, దూలూరు, అంబారిపేట గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం, వాకిటి రాజరెడ్డి, గడ్డం స్వామిరెడ్డి, తిరుపతిరెడ్డి, చిన్నారెడ్డి, ఎగ్యారపు శ్రీహరి తదితరులు ఉన్నారు.

మెట్‌పల్లి: పట్టణంలోని కోందడ రామాలయంలో ఉత్సవ మూర్తులకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించిన అనంతరం పల్లకి సేవను జరిపారు. పల్లకి సేవలో మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావుసరోజన దంపతులు పాల్గొన్నారు. అనంతరం స్వామి వారిని కల్యాణ మండపంలో ఏర్పాటు చేయగా ఇరిగేషన్ ఈఈ వెంకటేశ్వర్లు పట్టు వస్త్రాలు, మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు దంపతులు పలు రకాల పుష్పాలను అందజేశారు. నాయకులు జువ్వాడి కృష్ణారావు, నిర్వహకులు మహాజన్ నర్సింహులు పాల్గొని స్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రానావేణి సుజాత-సత్యనారాయణ, జెట్టి లింగం, అల్లూరి మహేందర్‌రెడ్డి, తిప్పిరెడ్డి అంజిరెడ్డి, నాయకులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్: మండలంలోని వేంపేట, వెల్లుల్ల, జగ్గసాగర్, ఆత్మకూర్, బండలింగాపూర్ గ్రామాల్లో జరిగిన వేడుకల్లో మాజీ సర్పంచులు బద్దం శేఖర్‌రెడ్డి, బద్దం సుగుణ-రాజేష్, చౌటుపల్లి లావణ్య-అంజయ్య ప్రజాప్రతినిధులు, నిర్వహకులు, భక్తులు పాల్గొన్నారు.

మల్లాపూర్: మండలంలోని మల్లాపూర్, వాల్గొండ, సిర్పూర్, మొగిలిపేటతో పాలు పలు గ్రామాల్లో స్వామివారి కల్యాణాన్ని ఘనంగా జరిపారు. సిర్పూర్‌లోని ఆలయంలో నిర్వహించిన కల్యామహోత్సవంలో టీపీసీసీ డెలిగేట్ నాయకుడు కల్వకుంట్ల సుజిత్‌రావు పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో నాయకులు జువ్వాడి కృష్ణారావు, రుత్త నారాయణ, కూన గోవర్ధన్, బాపురెడ్డి పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: మండలంలోని అమ్మక్కపేట, ఇబ్రహీంపట్నం, ఎర్దండి, వర్షకొండ, వేములకుర్తి తదితర గ్రామాల్లో అర్చకులు సీతారాముల కల్యాణం జరిపారు.

గొల్లపల్లి: మండల కేంద్రంలో జరిగిన సీతారామచంద్రస్వామి కల్యాణోత్సవంలో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పాల్గొని పూజలు చేశారు. ఆయాగ్రామాల్లో గల ఆలయాల్లో ఆలయ అర్చకులు సీతారామచంద్రస్వామి కల్యాణంను వైభవంగా జరిపారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నిశాంత్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రశేఖర్‌రావు, మాజీ సర్పంచ్‌లు గంగాధర్, సత్యనారాయణ, రాజ్యలక్ష్మి, తిరుపతిరెడ్డి, వెంకటేష్‌గౌడ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల: పట్టణంలోని రామాలయం, అష్టలక్ష్మి, సాయిబాబ, వేంకటేశ్వర ఆలయాలతో పాటు వివిధ అంజనేయ స్వామి ఆలయాల్లో రాముల వారి కల్యాణంను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పలు ఆలయాల్లో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు పూజలు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ అన్నం లావణ్య, వైస్‌చైర్మన్ గడ్డమీది పవన్, మున్సిపల్ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్: మండలంలోని అన్ని దేవాలయాలలో నిర్వహకులు సీతారాముల వారి కల్యాణం కన్నుల పండంగా జరిగాయి. ఈ సందర్భంగా అన్ని గ్రామాల్లోని దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మండలంలోని వెంకటపూర్‌లోని సీతారామస్వామి ఆలయంలో కల్యాణాన్ని వేదపండితులు నిర్వహించారు. ఎంపీపీ తోట నారాయణ, మాజీ సర్పంచ్ శారద-లింగారెడ్డి, కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు పూజలో పాల్గొన్నారు.

వెల్గటూర్: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో జరిగిన వేడుకల్లో వేడుకలు నిర్వహించారు. హనుమాన్ దీక్ష పరులు శ్రీరామ నామం జపిస్తూ పులకరించి పోయారు. ఆలయ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొని పూజలు నిర్వహించారు.



దూలూరులో పూజలు చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



మెట్‌పల్లిలో పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్



మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను ఆశీర్వదిస్తున్న అర్చకుడు



వెంకటాపూర్‌లో కల్యాణంలో పాల్గొన్న భక్తులు



మెట్‌పల్లిలో పట్టువస్త్రాలను అందజేస్తున్న ఇరిగేషన్ ఈఈ